గుర్నాథం బందర్లో లేడు! హైద్రాబాద్‌లో ఏదో హోటల్లో సర్వరుగా ఉంటున్నాడని గుర్నాథం తల్లి పిచ్చమ్మ చెప్పింది. అద్ర సిచ్చింది. కృష్ణమూర్తి ద్వారా విషయమంతా విని బాధపడి కొడుకుని తిట్టిపోసింది. వాడి కాళ్ళూ చేతులు విరగ్గొట్టయినాసరే పెళ్ళి జరిపించమంది.

కృష్ణమూర్తీ, ఖామందూ హైద్రాబాద్‌లో గుర్నాధాన్ని కలిశారు. కాళ్ళూ గడ్డమూ పట్టుకుని అతి దీనంగా బ్రతిమాలి, బహు కష్టం మీద పెళ్ళికి వప్పించారు—అయితే ఒక్క షరతు.

ఖామందుగారు తన యావదాస్తినీ పెళ్ళికి ముందే గుర్నాథం పేర వ్రాసేయాలి.

ఒప్పుకున్న ప్రకారం ఖామందు షరతును పాటించారు.

పెళ్ళి ఏ గుట్టూ బయటపడకుండానే బ్రహ్మాండంగా మద్రాసులో జరిగింది—

ఆ మర్నాడు ఖామందు కృష్ణమూర్తి దగ్గరకొచ్చి "నాయనా కృష్ణమూర్తి! నువ్వు వారం రోజుల్లో నీ పోర్షను ఖాళీచేసెయ్యాలి" అన్నాడు.

కృష్ణమూర్తి అదిరిపోయాడు. అనుకోని పిడుగు! "అదేమిటండీ?" అన్నాడు దీనంగా.

"ఏం చెయ్యమంటావు నాయనా! మా అల్లుడు మాతో 'కలిసి వుండట్ట. నీ పోర్షను లోనే విడిగా కాపురం పెట్టుకుంటాట్ట! లేకపోతే కంటికి కనబడకుండా పోతానంటున్నాడు" అన్నారు ఖామందు.

కృష్ణమూర్తి బిక్క మొహం పెట్టి ఆయన వంక చూడసాగాడు.

"అలా చూస్తావేం నాయనా? తప్పదు మరి. వాడు నీ పాలిట శనిగాడు-అందుకే ఇన్ని కష్టాలు నీకు! నా పాలిట ఆషాఢభూతిగాడు! నన్ను సర్వం దోచుకున్నాడు గదా! ఏం చేస్తాం? అంతే ఈ జీవితాలు" అంటూ సాగదీశాడు ఖామందు.

ఆ మర్నాడే మళ్ళీ ఇంటివేటకు బయల్దేరాడు కృష్ణమూర్తి. □

---

మినీ కథ:

# ఆమె కథ

"ఏమైనా పత్రికలు తెండీ" పోస్టుమాన్ భార్య శ్రీలక్ష్మి.

"ఎందుకూ పేరు గొప్ప వూరు దిబ్బ. పెద్ద ఎలక్ట్రికల్ సూపర్‌వైజరు. కరెంటు బిల్లు పాతిక రూపాయిలు-మీటరు కనెక్షన్ తప్పించండీ అంటే ధైర్యం చాలదు" ఆమె పేరు సతీసావిత్రి.

"పోలీసుద్యోగం చేసి రెండు మేడలు కట్టించేడు మా నాన్న. ఎందుకు మీరూ వున్నారు" అప్పలస్వామి పెళ్ళాం వరలక్ష్మి.

"నాలుక్కార్డులు పట్రండీ ఏదో ఇంటిదగ్గరుండి పూరికే కూర్చోవడమెందుకు చిన్న తరహా పరిశ్రమ ప్రారంభిస్తాను" సివిల్ సప్లయ్ ఆఫీసరు గుమస్తా భార్య సుగుణ.

"అందరికీ ఇంచక్కా వుద్యోగాలు. నా అమ్మడు మాత్రం రోడ్లంట" ఎంప్లాయిమెంటు గుమాస్తా భార్య పార్వతి.

"భద్రాచలం వెడదామని వుందండి. ఎవరితోనయినా చెప్పి ఫస్టుక్లాసు కంపార్టుమెంటు ఎక్కించేసారా ఆ పుణ్యమంతా మీదేనండి" టికెట్ కలెక్టర్ భార్య సత్యవతి.

"అందరి కథలూ అంటూ డబ్బిచ్చి మరీ అచ్చేసుకుంటారు. నా చెల్లెలి కథ అచ్చెయ్యమంటే వెయ్యరు. వారానికో నాలుగయినా వుత్తరాలు రాస్తోంది బావగారికి చెప్పి ఎలాగయినా తన కథ అచ్చేయించమని" కళ్ళనీళ్ళు పెట్టుకుంది నాగమణి. ఆమె ఎడిటరు భార్య మరి.

నో బ్రదర్... జీవితంలో మనిషి నిషాకి ఎక్కడ సోపానం వేస్తాడో ఏ ఒక్క జంట కథైనా తీసుకో నీకే అర్థమౌతుంది.

—జి. జి. కె రావు.